APTEL/2008/28200

## ఆర్టీసీ బస్సులో టికెట్ కొని ప్రయాణం చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ఖమ్మం : ఖమ్మం పాత బస్టాండ్ నుంచి బోనకల్ మండలం జగన్నాధపురం వరకు భట్టి విక్రమార్క సామాన్యుడిగా ప్రయాణం చేసారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మహాలక్ష్మి పథకం అమలవుతున్న వివరాలను ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు. ఆర్టీసీ ఉచిత ప్రయాణం చాలా బాగుంది, ఆర్థికంగా వెసులుబాటు అవుతుందని డిప్యూటీ సీఎం భట్టితో మహిళలు ఆనందం వ్యక్తం చేసారు. నాగులవంచ గ్రామానికి చెందిన జానమ్మ అనంతమ్మతో ముచ్చటిస్తూ కరెంటు మంచిగా వస్తుందా? ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం ఎలా ఉంది? ఎన్నిసార్లు ఉచితంగా ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేశారు? బడి గుడి పెళ్లి పేరంటాలకు ఉచిత బస్సులు వెళ్లడం వల్ల ఆర్థికంగా కొంత పెసరబాటు అవుతున్నదని డిప్యూటీ సీఎంతో వెల్లడించారు. పల్లె వెలుగు బస్సులో మహాలక్ష్మి వ్రత కలిసి ప్రయాణించడం చాలా సంతోషంగా ఉంది.




# తెలంగాణ ఫోకస్

తెలుగు దినపత్రిక

ప్రజల తెలంగాణ ప్రతిబింబం


## పెరిగిన ఆర్టీసీ బస్సు టిక్కెట్లు

హైదరాబాద్, జూన్ 12 : తెలంగాణలో మరో సారి ఆర్టీసీ బస్సు చార్జీలు పెరిగాయి. హైవేలపై టోల్ చార్జీలు పెంచుతూ కేంద్రం ఇటీవల నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. దీంతో జాతీయ రహదారులపై అన్ని టోల్‌గేట్లలో ఈ రుసుములు స్వల్పంగా పెరిగాయి. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ఆర్టీసీ టికెట్ చార్జీల్లో టోల్ గేట్ రుసుములు పెరిగాయి. టోల్ ప్లాజాలు ఉన్న మార్గాల్లో ప్రయాణించే ఆర్టీసీ బస్సుల్లో రూ.3 చొప్పున చార్జీలు పెరిగాయి. టోల్ గేట్లు ఉన్న రహదారుల్లో ప్రయాణించే ఆర్టీసీ బస్సులు కూడా టోల్ రుసుములు చెల్లించాల్సి ఉంది. కేంద్రం నిర్ణయంతో టోల్ గేట్ చార్జీలు పెరగడంతో ఆర్టీసీ ఆ భారాన్ని ప్రయాణికులపైనే మోపింది. టికెట్ చార్జీల్లో కలిసి ఉన్న టోల్ రుసుములను రూ.3 చొప్పున పెంచింది. ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రూ.10గా ఉన్న టోల్‌రుసుమును రూ.13కు, డీలక్స్, సూపర్ లగ్జరీ, రాజధాని, గరుడ, వజ్ర బస్సుల్లో ఉన్న రూ.13ను రూ.16కు, గరుడ ప్లస్ బస్సుల్లో రూ.14 నుంచి రూ.17కు, నాన్ ఏసీ స్లీపర్,


సంపుటి: 16 సంచిక : 41 కరీంనగర్ గురువారం, జూన్ 13, 2024 ఎడిటర్ : బోనగిరి నర్సింగ్ పేజీలు : 8 రూ. 2 రూపాయిలు


# ఎర్రకోటపై దాడి కేసు.. ఉగ్రవాది క్షమాభిక్ష పిటిషన్‌ని కొట్టేసిన రాష్ట్రపతి



ఢిల్లీ: ఢిల్లీలోని ఎర్రకోటపై 24 ఏళ్ల కిందట ఉగ్రదాడులు జరిగిన విషయం విదితమే. అయితే ఈ కేసులో దోషిగా నిర్ధారణ అయిన పాకిస్థాన్ ఉగ్రవాది మహ్మద్ ఆరిఫ్ అలియాస్ అష్ఫాక్ రాష్ట్రపతి ముందు క్షమాభిక్ష పిటిషన్ దాఖలు చేశాడు. అయితే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము క్షమాభిక్ష పిటిషన్‌ని తిరస్కరించారు. దాఖలు చేసుకున్న క్షమాభిక్ష పిటిషన్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తోసిపుచ్చినట్లు బుధవారం ఓ అధికారి తెలిపారు. రాష్ట్రపతిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ముర్ము తిరస్కరించిన రెండో క్షమాభిక్ష పిటిషన్ ఇదే. ఈ కేసులో మహ్మద్ ఆరిఫ్‌కు న్యాయస్థానం మరణశిక్ష విధించింది. 2022 నవంబరు 3న అతడి రివ్యూ పిటిషన్‌ను దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కొట్టివేసింది. దీంతో అతనికి మరణశిక్ష ఖరారైంది. ఆరిఫ్.. మే 15న ఆరిఫ్ రాష్ట్రపతి ద్రౌపది ముర్మును క్షమాభిక్ష కోరాడు. అయితే అతడి పిటిషన్‌ను ముర్ము మే 27న తోసిపుచ్చగా, 29న ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి. అయితే ఈ విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. 2000 డిసెంబరు 22న ఎర్రకోట వద్ద సైనిక స్థావరంపై పాక్ ఉగ్రవాదులు దాడి చేశారు. ఈ ఘటనలో ముగ్గురు భారత జవాన్లు మృతి చెందారు. దాడి జరిగిన నాలుగు రోజుల తర్వాత ఢిల్లీ పోలీసులు మహ్మద్ ఆరిఫ్‌ను అరెస్ట్ చేశారు. మహ్మద్‌ను లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థకు చెందినవాడి గుర్తించారు. మిలిటెంట్లతో కలిసి ఆరిఫ్ కుట్ర పన్నాడన్న ఆరోపణలు కోర్టులో నిరూపితమయ్యాయి. ఎర్రకోటపై దాడికి పాల్పడిన అబుబిలాల్, అబుషాద్, అబుహైదర్‌లు వేర్వేరు ఎన్ కౌంటర్లలో హతమయ్యారు. వీరంతా అక్రమంగా భారత్‌లోకి ప్రవేశించారని 2022లో సుప్రీంకోర్టు తెలిపింది. రాష్ట్రపతి కూడా క్షమాభిక్ష పిటిషన్‌ని తిరస్కరించడంతో మరణ శిక్ష పడటం దాదాపు నిర్ధారణ అయినట్లేనని నిపుణులు అంటున్నారు. అయితే, రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 ప్రకారం సుదీర్ఘ జాప్యం కారణంగా దోషి తన శిక్షను మార్చాలని కోరుతూ ఉన్నత న్యాయస్థానం తలుపులు తట్టవచ్చని నిపుణులు భావిస్తున్నారు.

# ఎన్నికల కోడ్ తరువాత తొలి కేబినెట్ భేటీ



హైద్రాబాద్ జూన్ 12 : తెలంగాణ రాష్ట్రంలో ఆందోళనలకు కారణమైన జీవో 317పై భేటీకానున్న కేబినెట్ సబ్ కమిటీ ఏం తేల్చనుంది.? స్థానికత కోల్పోయిన ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యపై ఎలాంటి క్లారిటీ ఇవ్వనుంది.? ఈ ప్రశ్నలకు సమాధానాల కోసం చాలా మంది ఎదురుచూస్తున్నారు. జూన్ 12 మధ్యాహ్నం మూడు గంటలకు తెలంగాణ కేబినెట్ సబ్ కమిటీ భేటీకానుంది. జీవో 317, జీవో 46పై ప్రధానంగా చర్చ జరగనుంది. మంత్రులు దామోదర రాజనర్సింహా, శ్రీధర్‌బాబుతో పాటు పొన్నం ప్రభాకర్ ఈ కేబినెట్ సబ్ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. గత ప్రభుత్వం హయాంలో తీసుకొచ్చిన 317 జీవో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు కారణమైంది. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల విధుల కేటాయింపుల్లో స్థానికత అనే అంశాన్నే మరిపోయిని సీనియార్టీకి పెద్దపీట వేశారంటూ ఉద్యోగులు పెద్ద ఎత్తున రోడ్డెక్కారు. తమ జిల్లాల్లో కాకుండా పరాయి జిల్లాల్లో విధులు నిర్వహించాల్సి వస్తుందంటూ నిరసన వ్యక్తం చేశారు. వందల కిలోమీటర్ల సుదూర ప్రాంతాలకు ప్రతిరోజూ ప్రయాణం చేయలేక శారీరక, మానసిక సమస్యలతో బలవంతంగా విధులు నిర్వహించాల్సి వస్తోందంటూ ఆందోళనలకు దిగారు. ఇక ఇటీవల రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 317జీవో బాధితులకు ఖచ్చితంగా న్యాయం చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో స్పష్టమైన హామీ ఇచ్చింది. అసెంబ్లీ సమావేశాల్లోనూ సీఎం రేవంత్ రెడ్డి కూడా స్థానికత కోల్పోయిన ఉద్యోగ, ఉపాధ్యాయులను తప్పకుండా త్వరలోనే వారి సొంత జిల్లాలకు పంపిస్తామని, వారి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అందులోభాగంగానే జీవో 317 బాధితులు నేరుగా వారి సమస్యలను తెలిపేందుకు గ్రీవెన్స్ వెబ్ పోర్టల్?ను అందుబాటులోకి తెచ్చారు. అంతేకాదు 317 జీవోపైన కేబినెట్ సబ్ కమిటీ కూడా వేసి.. సమస్య పరిష్కారం కోసం పనిచేస్తున్నారు. మొత్తంగా.. ఇవాళ భేటీకానున్న కేబినెట్ సబ్ కమిటీ మీటింగ్ చర్చనీయాంశంగా మారింది. జీవో 317పై సబ్ కమిటీ ఏం తేల్చుతుందా.? అన్న ఉత్కంఠ ఉద్యోగుల్లో నెలకొంది. దీంతోపాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అమలు చేయాల్సిన వాటిపై కూడా చర్చించనున్నట్లు తెలుస్తోంది. ఆగస్ట్ లోగా రైతు రుణమాఫీ చేస్తానన్న సీఎం రేవంత్, దానిపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. దీనిపై కూడా చర్చజరిగే అవకాశం కనిపిస్తోంది. ఎన్నిలక కోడ్ ముగిసిన తరువాత జరగనున్న మొదటి క్యాబినెట్ సమావేశం కావడంతో సర్వత్రా ఆసక్తినెలకొంది.

## కువైట్‌కు తక్షణం వెళ్లాలని మంత్రిని ఆదేశించిన మోదీ




న్యూఢిల్లీ: కువైట్‌లో సంభవించిన భారీ అగ్నిప్రమాద ఘటనపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తక్షణ చర్యలకు దిగారు. సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు వెంటనే కువైట్ వెళ్లాలని కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్‌ను ఆదేశించారు. స్థానిక వార్తా కథనాల ప్రకారం, కువైట్ సిటీలో బుధవారం ఉదయం సంభవించిన భారీ అగ్నిప్రమాదంలో కనీసం 49 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో 40 మంది భారతీయ కార్మికులు మరణించినట్టు కూడా కొన్ని వార్తా సంస్థలు ప్రకటించాయి. అయితే ఎంఈఏ తొలి ప్రకటనలో మృతుల సంఖ్య ప్రస్తావన లేకుండా క్షతగాత్రుల సంఖ్యను మాత్రమే ప్రకటించింది. కువైట్‌లోని భారత రాయబార కార్యాలయం కూడా ఇదే రీతిలో స్పందించింది. 30 మందికి పైగా భారతీయ కార్మికులు చికిత్స పొందుతున్నట్టు తెలిపింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సైతం కువైట్ ట్రాజెడీ తీవ్ర ఆందోళన కలిగిస్తోందని, పరిస్థితిని కువైట్‌లోని భారత ఎంబసీ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోందని చెప్పారు. కాగా, తక్షణం పరిస్థితిని సమీక్షించి, సహాయక చర్యలను పర్యవేక్షించాల్సిందిగా విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్దన్ సింగ్‌ను ప్రధానమంత్రి ఆదేశించినట్టు ఎంఈఏ ఒక ప్రకటనలో తెలిపింది. అగ్నిప్రమాదంలో గాయపడిన వారి సహాయక చర్యలను సమీక్షించడం, మృతదేహాలను వెనక్కి తెచ్చేందుకు అవసరమైన చర్యలను స్థానిక అధికారుల సమన్వయంతో చేపట్టాలని మంత్రిని ప్రధాని ఆదేశించినట్టు పేర్కొంది.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం.. కోర్టు తీర్పుపై ఉత్కంఠ

హైద్రాబాద్ జూన్ 12 : తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. పోలీసులు నాంపల్లి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేయడం హాట్ టాపిక్‌గా మారింది. రోజుకో ట్విస్ట్‌తో తెలంగాణలో సెన్సేషన్ క్రియేట్ చేసిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసు విచారణలో దూకుడు పెంచిన పోలీసులు.. తాజాగా ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించిన ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై మార్చి 10న ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు.. ఇప్పటి వరకు ప్రణీత్‌రావు, భుజంగరావు, తిరుపతన్న, రాధాకిషన్‌రావును అరెస్ట్ చేశారు. ఆరుగురిని నిందితులుగా చేర్చారు. తాజాగా కోర్టులో దాఖలు చేసిన చార్జ్ షీట్‌లో ఈ విషయాలను వెల్లడించారు. మరో వైపు అడిషినల్ ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న నాంపల్లి కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు.

## హైదరాబాద్ రెస్టారెంట్ అసోసియేషన్లకు మంత్రి స్వీట్ వార్నింగ్..



హైద్రాబాద్ జూన్ 12 : హైదరాబాద్‌కు ఓ బ్రాండ్ ఇమేజ్ ఉందని.. హైదరాబాద్ బిర్యానీకి ఓ చరిత్ర ఉందన్నారు తెలంగాణ మంత్రి దామోదర రాజనర్సింహ. ఆహారాన్ని కల్తీ చేసి సిటీ పరువు తీయొద్దని హోటల్ నిర్వాహకులకు వార్నింగ్ ఇచ్చారు మంత్రి. ఆహారాన్ని కల్తీ చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని సీరియస్ వార్నింగ్ ఇచ్చారు తెలంగాణ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ. గత నెల నగరంలోని పలు ప్రముఖ రెస్టారెంట్లలో ఫుడ్ కమిషన్ అధికారులు సోదాను నిర్వహించారు. ఈ దాడుల్లో నివ్వెరపోయే దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. పాడైన పదార్థాలు, కల్తీ వస్తువులతో వండుతున్నట్లు తెలిసింది. దీంతో ఫుడ్ సేఫ్టీ అధికారులు సీరియస్ అయ్యారు. హోటల్ నిర్వాహకుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే హోటల్ అసోషియేషన్ ప్రతినిథులు గతంలో ఒక సామావేశం ఏర్పాటు చేసి హైజిన్ నిర్వహించడంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇదిలా ఉంటే తాజాగా సిటీలోని ప్రముఖ హోటల్స్ అసోసియేషనతో తెలంగాణ వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ సమీక్ష సమావేశంలో పాల్గొన్న మంత్రి.. కొంతకాలంగా వెలుగులోకి వస్తున్న ఆహార కల్తీ వ్యవహారంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నిజాం కాలం నుండి హైదరాబాద్ బిర్యానీకి అంతర్జాతీయంగా గుర్తింపు ఉందన్నారు. కానీ ఫుడ్ సెఫ్టీ అధికారుల తనిఖీల్లో వెలుగు చూస్తున్న అంశాలు మాత్రం ఆందోళనకరంగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. ఫుడ్ క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచుతున్నామని.. ఈ క్రమంలో హోటల్ యజమానులు సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని మంత్రి సూచించారు. నాణ్యమైన ఆహారాన్ని ప్రజలకు అందించాలని వివిధ అసోసియేషన్ ప్రతినిధులకు తెలియజేశారు. హైదరాబాద్‌ను మెడికల్ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతున్నామన్నారు. ప్రతి 6 నెలలకు ఒకసారి వర్క్ షాప్‌ల నిర్వహణతో పాటు అవగాహన సదస్సులను నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా హోటల్స్ యజమానులు చేసిన పలు విజ్ఞప్తులపై సానుకూల స్పందించారు. హైదరాబాద్‌లోని పలు హోటళ్లు, రెస్టారెంట్లలో తనిఖీల్లో విస్తుపోయే విషయాలు వెలుగు చూశాయి. నాసిరకం ఆహారం సరఫరా చేస్తూ వినియోగ దారుల జేబులు ఖాళీ చేయడమే కాకుండా.. వారి ఆరోగ్యాన్ని కూడా నిర్వాహకులు నాశనం చేస్తున్నారు. కొన్ని రోజుల పాటు నిల్వ ఉంచిన మాంసం, ఇతర వస్తువులను వంటల్లో వినియోగిస్తూ కస్టమర్ల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న దృశ్యాలు అంతా విస్తుపోయేలా చేశాయి. దీంతో రంగంలోకి దిగిన ప్రభుత్వం.. భవిష్యత్తులో ఆహారాన్ని కల్తీ చేస్తే సహించబోమని హెచ్చరించింది.

## అరుణాచల్ సీఎంగా తిరిగి పెమా ఖండూ.. లెజిస్లేచర్ పార్టీ నేతగా ఏకగ్రీవ ఎన్నిక




ఇటానగర్: బీజేపీ నేత పెమా ఖండూ అరుణాచల్ ప్రదేశ్ బీజేపీ లెజిస్లేచర్ పార్టీ నేతగా బుధవారంనాడు తిరిగి ఎన్నికయ్యారు. దీంతో మరోసారి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఆయన పగ్గాలు చేపట్టేందుకు మార్గం సుగమమైంది. భారతీయ జనతా పార్టీ కేంద్ర పరిశీలకులైన రవిశంకర్ ప్రసాద్, తరుణ్ చుగ్ సమక్షంలో కొత్తగా ఎన్నికైన బీజేపీ ఎమ్మెల్యేలు సమావేశమై పెమా ఖండూను లెజిస్లేచర్ పార్టీ నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర ఎంపీ, కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు కూడా హాజరయ్యారు. లెజిస్లేచర్ పార్టీ నేతగా ఎన్నికైన పెమా ఖండూ సీఎం పదవిని చేపట్టనుండటం వరుసగా ఇది మూడోసారి కానుంది. ఈనెల 13వ తేదీ గురువారంనాడు తన క్యాబినెట్ మంత్రులతో కలిసి ఆయన ప్రమాణస్వీకారం చేయనున్నారు. పెమా ఖండూ తొలిసారి 2016లో సీఎం అయ్యారు. కాగా, ఇటీవల ముగిసిన అరుణాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో 60 స్థానాలకు గాను బీజేపీ 46 సీట్లు గెలుచుకుని తమ సత్తా చాటుకుంది.

# టెట్ ఫలితాలు రిలీజ్

హైదరాబాద్, జూన్ 12 : తెలంగాణలో టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ ఫలితాలు బుధవారం (జూన్ 12) వెలువడ్డాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫలితాలను విడుదల చేశారు. అధికారిక వెబ్‌సైట్‌లో ఫలితాలను అందుబాటులో ఉంచారు. అభ్యర్థులు తమ జర్నల్ నెంబరు, హాల్‌టికెట్ నెంబరు, పుట్టినతేదీ వివరాలు నమోదుచేసి ఫలితాలు చూసుకోవచ్చు. పరీక్షలు పూర్తయిన పదిరోజుల్లోనే టెట్ ఫలితాలను విడుదల చేయడం విశేషం.టెట్-2024 ఫలితాలకు సంబంధించి మొత్తం 2,86,381 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో పేపర్-1పరీక్షకు 85,996 అభ్యర్థులు హాజరుకాగా.. 57,725 అభ్యర్థులు అర్హత సాధించారు. ఇక పేపర్-2 పరీక్షకు 1,50,491 అభ్యర్థులు హాజరుకాగా.. 51,443 అభ్యర్థులు అర్హత సాధించారు. పేపర్-1లో అర్హత సాధించిన వారు 67.13% అర్హత నమోదుకాగా.. పేపర్-2లో 34.18 శాతం అభ్యర్థులు అర్హత సాధించారు. టెట్-2023 ఫలితాలతో పోల్చితే పేపర్-1లో 30.24 శాతం, పేపర్-2లో 18.88 శాతం అర్హత పెరగడం గమనార్హం.

**అభ్యర్థులకు బంపరాఫర్..**

టెట్-2024లో అర్హత సాధించలేకపోయిన అభ్యర్థులకు వచ్చే టెట్‌కు ఉచితంగా దరఖాస్తు చేసుకునే వెలుసుబాటును ప్రభుత్వం కల్పించింది. అదేవిధంగా టెట్-2024లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఒకసారి ఉచితంగా డీఎస్సీ దరఖాస్తు చేసుకునే వెసులుబాటును రేవంత్ సర్కార్ కల్పించింది .రాష్ట్రంలో మే 20 నుంచి జూన 2 వరకు టెట్ పరీక్షలు నిర్వహించిన సంగతి తెలిసిందే. మొదటి సారిసగా ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 11 జిల్లా కేంద్రాల్లో టెట్ పరీక్షలు నిర్వహించారు. టెట్ పరీక్షకు సంబంధించిన ప్రాథమిక కీని జూన్ 3న అధికారులు విడుదల చేశారు. దానిపై అభ్యంతరాలు స్వీకరించి తుది ఆన్సర్ కీని రూపొందించింది. జూన్ 12న ఫైనల్ ఆన్సర్ కీతోపాటు ఫలితాలను వెల్లడించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది.

**అర్హత మార్కులు..**

టెట్ పరీక్షలకు సంబంధించి 150 మార్కులకు పేపర్-1, 150 మార్కులకు పేపర్-2 నిర్వహించారు. ఒక్కో పేపరులో 150 ప్రశ్నలు ఉంటాయి. పేపర్-1లో 5 విభాగాలు ఉంటాయి. ఒక్కో విభాగంలో




30 ప్రశ్నలు- 30 మార్కులు కేటాయించారు. ఇక పేపర్-1లో 4 విభాగాలు ఉంటాయి. వీటిలో మొదటి మూడు విభాగాల్లో 30 ప్రశ్నలు- 30 మార్కులు, నాలుగో విభాగానికి 60 ప్రశ్నలు - 60 మార్కులు కేటాయించారు. పరీక్షల్లో అర్హత మార్కులను 60 శాతం, బీసీలకు 50 శాతం, ఎస్సీ-ఎస్టీ-దివ్యాంగులకు 40 శాతంగా నిర్ణయించారు.

**జూన్ 20 వరకు డీఎస్సీ దరఖాస్తుకు అవకాశం..**

తెలంగాణలో 11,062 టీచర్ పోస్టుల భర్తీకి డీఎస్సీ-2024 దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది. డీఎస్సీ దరఖాస్తు ప్రక్రియ మార్చి 4న ప్రారంభంకాగా... జూన్ 20తో గడువు ముగియనుంది. ప్రకటించిన షెడ్యూలు ప్రకారం జులై 17 నుంచి 31 వరకు టీఎస్ డీఎస్సీ నిర్వహించనున్న సంగతి తెలిసిందే. అయితే డీఎస్సీకి కూడా ఇప్పటి వరకూ పెద్దగా దరఖాస్తులు రాలేదు.

# మరో యాత్రకు రాహుల్



**లక్నో, జూన్ :** సార్వత్రిక సమరంలో ఫలితాలు దాదాపు తారుమారయ్యాయి. మూడో సారి ప్రధానిగా అధికారం చేపట్టనున్న మోదీకి ఈ ఎన్నికలు చక్కని గుణపాఠం చెప్పాయి. ముఖ్యంగా మత రాజకీయాలు, మత విద్వేషాలతో ఓట్లు రావన్న సంగతి ఇప్పటికైనా బీజేపీ నేతలు గుర్తించాలని రాజకీయ విమర్శకులు సూచిస్తున్నారు. ముఖ్యంగా యూపీలోనే బీజేపీకి మెజారిటీ స్థానాలు తగ్గిపోయాయి. అనూహ్యంగా కాంగ్రెస్ కూటమికి అత్యధిక సీట్లు వచ్చాయి. ఈ ప్రభావం యూపీలో వచ్చే అసెంబ్లీ ఎన్నికలపై పడినా ఆశ్చర్యపోనక్కర్లేదు. అందుకే రాహుల్, అఖిలేష్ ఆధ్వర్యంలో యూపీ ప్రజలకు ధన్యవాదాలు తెలిపేందుకు కాంగ్రెస్ కూటమి సిద్ధం అవుతోంది. మొత్తం యూపీలోని 403 అసెంబ్లీ నియోజకవర్గాలలో 'ధన్యవాద్ యాత్ర' పేరిట ఈ యాత్ర ఉండబోతోంది. ఈ ధన్యవాద్ యాత్ర 15న ముగుస్తుంది. ఈ యాత్రలో కూటమి సీనియర్ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు. యాత్రలో భాగంగా సమాజాంలోని పలు వర్గాలకు చెందిన వారికి రాజ్యాంగం కాపీలను బహుకరించనున్నారు. యూపీలో మొత్తం 80 పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. ఇక కాంగ్రెస్ కూటమి ఏకంగా 43 సీట్లు కైవసం చేసుకోగా బీజేపీ 33 సీట్లకే పరిమితం అయింది. సమాజ్ వాదీ పార్టీ 37.. కాంగ్రెస్ 6 స్థానాల్లో గెలుపొందింది. కాంగ్రెస్ కంచుకోట రాయ్ బరేలీ నుంచి రాహుల్ గాంధీ ఘన విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో బీజేపీ 62 సీట్లు గెలుచుకోగా.. ఎస్పీ ఒక స్థానం, కాంగ్రెస్ 5 స్థానాల్లోనే గెలుపొందింది. యూపీలో బీజేపీ కూటమి ఓటమికి బలీయమైన కారణం ఆ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం రెండూ ఆర్థిక వ్యవస్థ పరిస్థితిని చర్చనీయాంశంగా చేశాయి. అధికారిక లెక్కల ప్రకారం 2017 నుంచి 2021 వరకూ యూపీ ఆర్థిక వ్యవస్థ యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలో ఆశించిన స్థాయిలో రాణించలేదు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి కేవలం 1.95 శాతం చొప్పున మాత్రమే వృద్ధి సాధించింది. ఇక తలసరి ఆదాయ వృద్ధి సంవత్సరానికి 0.43 శాతం మాత్రమే. అంతకు ముందు అంటే 2012-17 మధ్యకాలంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి సంవత్సరానికి 6.92 శాతం చొప్పును పెరగింది. 2007-12 మధ్యకాలంలో బీఎస్పీ అధినేత్రి మాయావతి కాలంలో 7.28 శాతం చొప్పన పెరిగింది. యోగా అధిత్యనాథ్ హయాంలో శాంతి భద్రతలు అదుపులో ఉన్నప్పటికీ నేరస్థులపై యోగి అనుసరించిన విధానం పౌర హక్కులకు భంగం కలిగించే రీతిలో ఉన్నాయయి విమర్శలొచ్చాయి. పైగా యోగికి బుల్డోజర్ బాబాగా అపఖ్యాతి వచ్చింది. నేరస్థుల ఇళ్లపై బుల్డోజర్ పంపి కూల్చివేయడం వంటి చర్యలు అన్నీ బీజేపీపై వ్యతిరేకత పెంచేలా చేశాయియూపీలో ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా యమునా, గంగ ఎక్స్‌ప్రెస్ వే, సనౌటా?పుర్కాజీ ఎక్స్‌ప్రెస్ వే, వారణాసి ?నోయిడాల మధ్య ఎనిమిది లేన్ల రహదారి వంటి అనేక భారీ ప్రాజెక్టులు మొదలయ్యాయి. అలాగే కుశినగర్, జేవార్‌ల వద్ద అంతర్జాతీయ విమానాశ్రయానికీ ప్రణాళిక సిద్ధమైంది. కానీ, ఈ రెండింటికీ బీజం పడ్డది మాయావతి కాలంలో. అఖిలేశ్ ఈ ఆలోచనలను కొనసాగించారు. మొత్తం మీద 2024 ఎన్నికలు హిందుత్వ భావజాలానికీ, సామాజిక న్యాయాన్ని కోరే మండల్ వర్గాలకూ మధ్య హోరాహోరీగానే సాగింది. రాముడి చుట్టూ తిరిగిన రాజకీయాలను కాస్తా ప్రజల జీవనోపాధి సమస్యల వైపు మళ్లించిన ఘనత 'ఇండియా' కూటమికి దక్కుతుంది. ఇంకోలా చెప్పాలంటే 2014 తరువాత మొదటిసారి బీజేపీ మతతత్వ పాచిక పారలేదని చెప్పాలి.


# ప్రతి రోజూ పాఠశాలల్లో విద్యార్థులకు స్పోర్ట్స్ పీరియడ్, లైబ్రరీ ఉండేలా చర్యలు : జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



పెద్దపల్లి, జూన్ -12: ప్రతిరోజూ పాఠశాలల్లో విద్యార్థులకు స్పోర్ట్స్ పీరియడ్, లైబ్రరీ ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రధానోపాధ్యా యులకు తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పెద్దపల్లి మండలం రాఘవాపూర్ గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను వేసవి సెలవుల అనంతరం పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా సందర్శించారు. పాఠశాలకు విచ్చేసిన జిల్లా కలెక్టర్ కు ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. పాఠశాలను ఆసాంతం పరిశీలించిన కలెక్టర్ అమ్మ ఆదర్శ కమిటీ ద్వారా చేపట్టిన పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో న్యూట్రి గార్డెన్ ద్వారా విద్యార్థులకు పౌష్టికాహారం అందేలా చూడాలని అన్నారు. పాఠశాల కిచెన్ షెడ్ ను పరిశీలించిన కలెక్టర్ మధ్యాహ్న భోజన కార్మికులు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, ఏదైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకొని రావాలని అన్నారు. పాఠశాలకు వచ్చే బియ్యం నాణ్యతను పరిశీలించి తీసుకోవాలని, నాణ్యమైన బియ్యం రాని పక్షంలో వెంటనే తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య అనుగుణంగా టాయిలెట్లు ఏర్పాటు చేయాలని, టాయిలెట్లలో టైల్స్ వేయాలని, వాటిని పకడ్బందీగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. రాత్రి పూట పాఠశాల వద్ద ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చూడాలని, దీనికి గ్రామ పెద్దల సహకారం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ విద్యార్థులతో ముచ్చటించారు. సమ్మర్ హాలిడేస్ ఎలా గడిపారంటూ విద్యార్థులను ప్రశ్నించారు. మన జీవిత స్థాయిని, జీవన విధానాన్ని విద్య మాత్రమే మార్చగలుగు తుందని, మన పూర్వపు తరాల వారికి రాని అవకాశం మనందరికీ వచ్చిందని, మనకు అందిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రతి ఒక్కరూ రోజూ చదువుకోవాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులు పాఠశాలకు రెగ్యులర్ గా హాజరుకావాలని, చిన్నతనం నుంచి మంచి ఆహారపు అలవాట్లు చేసుకోవాలని, బయట జంక్ ఫుడ్ తినవద్దని, ప్లాస్టిక్ వస్తువులలో ఇచ్చే ఆహారం ఎట్టి పరిస్థితుల్లోనూ తినవద్దని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. పదవ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశామని, జీవితంలో మొట్ట మొదటి పబ్లిక్ పరీక్షలు పదవ తరగతిలో ఎదుర్కొంటామని, మంచి మార్కులతో ప్రతి ఒక్క విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలని, టీచర్లు చెప్పే పాఠాలు శ్రద్ధగా వినాలని, మన స్నేహితులు పాఠశాలకు రెగ్యులర్ గా రాని పక్షంలో వారి వెంటపడి రెగ్యులర్ గా వచ్చేలా చూసుకోవాల్సిన బాధ్యత కూడా మనపై ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. పాఠశాలల్లో ఇకనుంచి ప్రతి రోజు స్పోర్ట్స్, లైబ్రరీ పీరియడ్ ఉండేలా చర్యలు తీసుకున్నామని, విద్యార్థులు ప్రతిరోజు కొంత సమయాన్ని క్రీడలు ఆడటానికి కేటాయించాలని, లైబ్రరీ పీరియడ్ సమయంలో మంచి పుస్తకాలను చదవడం అలవర్చుకోవాలని కలెక్టర్ సూచించారు.

# హర్యానా లెక్కే వేరప్పా

**ఛండీఘడ్, జూన్:** అదృష్టం అంటే వీరిదే.. ఆ రాష్ట్రంలో గెలిచింది ఐదుగురైతే.. ఏకంగా ముగ్గరికి మంత్రి పదవులు లభించాయి.. దీంతో ఆ రాష్ట్రంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.. ఇంతకీ ఆ రాష్ట్రంలో ఏం జరిగింది. మోదీ ఎలాంటి ప్లాన్ వేశారు? మూడోసారి దేశ ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారం చేశారు. 72 మందితో మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అయితే ఇందులో పార్టీ ప్రాధాన్యతలు, అవసరాల ఆధారంగా కొంతమందికి స్థానం లభించింది. అయితే హర్యానా రాష్ట్రానికి ఏకంగా మూడు మంత్రి పదవులు లభించడం ఆసక్తికరంగా మారింది. వాస్తవానికి హర్యానా ఉత్తర ప్రదేశ్ లాగా పెద్ద రాష్ట్రం కాదు. మధ్యప్రదేశ్ లాగా బిజెపి క్లీన్ స్వీప్ చేయలేదు. అయినప్పటికీ ఆ రాష్ట్రానికి మూడు కేంద్రమంత్రి పదవులు ఇవ్వడం సరికొత్త చర్చకు దారితీస్తోంది. హర్యానా రాష్ట్రంలో 90 అసెంబ్లీ, పది పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి.. ఇటీవల ఎన్నికల్లో ఈ రాష్ట్రంలో బిజెపి ఐదు పార్లమెంటు స్థానాలు మాత్రమే గెలుచుకుంది. అయితే ఆ ఐదుగురిలో ముగ్గురికి కేంద్ర మంత్రివర్గంలో చోటు ఇచ్చింది. చదువుతుంటే ఆశ్చర్యంగా అనిపించినప్పటికీ.. గతానికంటే భిన్నంగా ఈసారి మోదీ హర్యానా రాష్ట్రానికి విపరీతమైన ప్రాధాన్యమిచ్చారు.. ఇందుకు కారణం లేకపోలేదు. ఎందుకంటే త్వరలో హర్యానా రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. దీంతో ఆ రాష్ట్రంపై బిజెపి ప్రధానంగా దృష్టి సారించినట్టు తెలుస్తోంది. హర్యానాతోపాటు మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాలలోనూ ఈ ఏడాది ఎన్నికలు జరగనున్నాయి. హర్యానా రాష్ట్రం ఢిల్లీకి అత్యంత సమీపంలో ఉంటుంది.. మరో నాలుగు నెలల్లో అక్కడ ఎన్నికలు జరగనున్నాయి. అక్కడ ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలో ఉంది. అయితే ఈసారి జరిగే ఎన్నికల్లో ఇక్కడికి గెలవాలని బిజెపి భారీగా ఆశలు పెట్టుకుంది. ఒకవేళ హర్యానా రాష్ట్రంలో ఓడిపోతే ఆ ప్రభావం కేంద్ర ప్రభుత్వంపై ఎంతో కొంత ఉంటుంది. దీంతో హర్యానా రాష్ట్రంలో



గెలుపును కమలం పార్టీ నాయకులు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. అందువల్లే ఐదుగురు పార్లమెంటు సభ్యులు గెలిచినప్పటికీ ముగ్గరికి మంత్రి పదవులు ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. హర్యానా మాజీ ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ను మంత్రివర్గంలోకి తీసుకోవడం వెనుక అసలు కారణం అదే అని విశ్లేషకులు భావిస్తున్నారు. హర్యానా రాష్ట్రంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం మైనారిటీలో ఉంది.. 90 అసెంబ్లీ స్థానంలో ఉన్న ఈ రాష్ట్రంలో అధికారాన్ని దక్కించుకోవాలంటే 46 సీట్లను గెలుచుకోవాలి. ఈ రాష్ట్రంలో బిజెపికి 41 స్థానాలు ఉన్నాయి. హెచ్ఎల్ పీ, మరో స్వతంత్ర అభ్యర్థి ఎన్డీఏలో చేరడంతో బిజెపి బలం 43 కు చేరుకుంది. ప్రస్తుతం అక్కడ మూడు ఎమ్మెల్యే స్థానాలు వేకెన్ట్ లో ఉన్నాయి. దీంతో అక్కడ ప్రభుత్వ ఏర్పాటుకు 44 మంది ఎమ్మెల్యేల బలం అవసరం ఉంది. బిజెపికి 43 మంది మాత్రమే ఉన్నారు.. అయితే ఎన్నికలకు మరో నాలుగు నెలల సమయం మాత్రమే ఉండడంతో ఇక్కడ ప్రభుత్వం కూలిపోయే అవకాశాలు లేకపోలేదు.. ఇక ఇండియా కూటమి కూడా త్వరలో జరిగే ఎన్నికల్లో విజయాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈ నేపథ్యంలో మరో నాలుగు నెలల్లో జరిగే ఎన్నికల్లో హోరాహోరీ పోరు తప్పదని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# ఆగని చెరువుల ఆక్రమణలు

**రంగారెడ్డి, జూన్ :** హైదరాబాద్ మహానగరం వేగంగా విస్తరిస్తోంది. రోజురోజుకీ భవన నిర్మాణాలు పెరిగిపోతున్నాయి. రియల్ ఎస్టేట్ రంగం దూసుకెళ్తోంది. ఈ క్రమంలో కబ్జాలు కూడా విచ్చలవిడిగా జరుగుతున్నాయి. ప్రభుత్వ భూములు మాయం అవుతున్నాయి. చెరువులు సైతం కనిపించకుండాపోతున్నాయి. కాలువలను కబ్జా చేసి, చెరువులను మాయం చేసి పెద్దపెద్ద నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ క్రమంలోనే ఎన్నో వివాదాలు నెలకొన్నాయి. వాటిలో ఎర్రకుంట చెరువు ఒకటి. బాచుపల్లిలోని సర్వే నెంబర్ 134లో ఉంటుంది ఎర్రకుంట చెరువు(లేక్ ఐడీ: 2800/ఈ/17). అయితే, ఇక్కడ మూడు నిర్మాణాలకి హెచ్ఎండీఏ, రెవెన్యూ అధికారుల నుంచి పర్మిషన్ రావడం వివాదాస్పదమైంది. చాలా రోజులుగా దీనిపై స్థానిక బీజేపీ నేతలు పోరాడుతున్నారు. పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మార్చి 18న సర్వే జరిగింది. డీఐ సర్వేయర్ గంగాధర్, ఏడీ శ్రీనివాస్, బాచుపల్లి ఎంఆర్ఓ రిపోర్ట్ రెడీ చేశారు. అందులో ప్రభుత్వ భూమి కబ్జా కాలేదని, అది ప్రవేట్ భూమేనని పేర్కొన్నారు. దీన్నిబట్టి ఎర్రకుంట చెరువు మొత్తాన్ని ప్రైవేట్ వ్యక్తుల చేతులకి అప్పగించే కుట్రలు జరుగుతున్నాయని బీజేపీ నేతలు మండిపడుతున్నారు. డీఐ సర్వేయర్ గంగాధర్, ఏడీ శ్రీనివాస్ తీరుపై ముందు నుంచి అనుమానాలు ఉన్నాయి. ఒక్కో కో ఆర్డినేట్‌ను దాదాపు 9 మీటర్ల మేర జరిపి కార్పొరేటర్, కొందరు బిల్డర్లకు లబ్ది చేకూర్చేలా సర్వే చేశారని అంటున్నారు. మార్చి 11 తేదీన సర్వేలో చెరువు స్థలం 3 ఎకరాలు వస్తే, 18వ తేదీ చూపించిన హద్దుల తర్వాత 2.19 ఎకరాలు మాత్రమే వచ్చిందని ఇదెలా సాధ్యమని ప్రశ్నించారు. చెరువు స్థలం ఎందుకు తగ్గింది? ఎలా తగ్గిందని అడుగుతున్నారు బీజేపీ నేతలు. ఎర్రకుంటలోని ఆక్రమణలు తొలగించే వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. తప్పుల తడకగా సర్వే నిర్వహించారని ఆరోపించారు. ఎర్రకుంట చెరువును క్రమించి తప్పుడు పత్రాలలో అనుమతులు పొంది ధ్వంసం చేశారని, సరైన సర్వే చేసి కాపాడాలని డిమాండ్ చేశారు బీజేపీ నేతలు. కలెక్టర్‌కు, ఇరిగేషన్ అధికారులకు



ఫిర్యాదుల మీద ఫిర్యాదులు చేస్తే ఇప్పటికి గానీ సర్వేకు రాలేదని, తీరా సర్వే చేసి మూడు ఎకరాల ఎర్రకుంట చెరువు ప్రభుత్వ భూమి కాదని ప్రైవేట్‌దని రిపోర్ట్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఈ విధంగా సర్వే రిపోర్ట్ ఇవ్వడం వెనుక కోట్ల రూపాయలు చేతులు మారాయని ఆరోపించారు. సర్వేయర్లు దాదాపు రెండు కోట్ల ముడుపులు దండుకొని ఆక్రమణదారులకు అనుకూలంగా సర్వే రిపోర్ట్ తయారు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కలెక్టర్, హెచ్ఎండీఏ అధికారులు అక్రమ అనుమతులు, తప్పుడు సర్వే రిపోర్ట్‌పై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. డీఐ సర్వేయర్ గంగాధర్, ఏడీ సర్వేయర్ శ్రీనివాస్‌ను తక్షణమే సస్పెండ్ చేసి విచారణ జరిపి, ఎర్రకుంట చెరువులో అక్రమ నిర్మాణాలు కూల్చివేయాలని, లేకపోతే అక్కడ టెంటు వేసి నిరాహార దీక్షకు దిగుతామని బీజేపీ నాయకులు, కార్పొరేషన్ సెక్రెటరీ అరుణ్ రావు, మీడియా సెల్ కో కన్వీనర్ ఉదయ్, కిసాన్ మోర్చా అధ్యక్షులు ప్రసాద్ రాజు, ఉపాధ్యక్షులు మాధవరావు, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి ముఖేష్ సీనియర్ నాయకులు ఎల్లస్వామి, కాలనీవాసులు తదితరులు హెచ్చరించారు. గత తొమ్మిది సంవత్సరాల్లో బీఆర్ఎస్ నేతలు కబ్జాలకు సహకరించి, అనుమతులు ఇప్పించి ఇప్పుడు చెరువులు కాపాడాలని ఎమ్మెల్యే వివేకానంద చిలుక పలుకులు పలుకుతున్నారని, చిత్తశుద్ధి ఉంటే ఎర్రకుంటను కాపాడాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ గౌతం, హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్ ఆమ్రపాలి దీనిపై దృష్టి సారించాలని కోరారు.

# రేషన్ కార్డుల కసరత్తు



**హైదరాబాద్, జూన్ :** తెలంగాణలో కొత్త రేషన్ కార్డులు జారీపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. త్వరలోనే అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామని ప్రకటన చేశారు. రేషన్ కార్డుతో ఆరోగ్యశ్రీ, పింఛన్, ఫీజు రీయింబర్స్మెంట్, ఇతర ప్రభుత్వ పథకాలు ముడిపడి ఉన్నాయి. దీంతో కొత్త రేషన్ కార్డుల కోసం అర్హులు ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల జరిగిన కేబినెట్ భేటీలో రేషన్ కార్డుల జారీపై కీలక నిర్ణయం తీసుకున్నారు. దీంతో పాటు అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం అందించేందుకు కసరత్తు చేస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. మూడు నెలల తర్వాత రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ చేస్తామన్నారు. దీంతో సామాన్యులకు డబ్బు ఆదా అవుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ త్వరలోనే తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. కేబినెట్ భేటీలో ఈ విషయంపై చర్చించామని, విధి విధానాలు రూపొందిస్తున్నామన్నారు. రేషన్ కార్డుదారులకు 3 నెలల తర్వాత సన్నబియ్యం పంపిణీ చేస్తామన్నారు. ఈలోపు కొత్త రేషన్ కార్డులు కూడా జారీ చేస్తామన్నారు. సన్నవడ్లకు రూ. 500 బోనస్ ఇచ్చేందుకు మంత్రి వర్గ భేటీలో నిర్ణయం తీసుకున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను పేద, మధ్యతరగతి వారే లక్ష్యంగా అమలు చేస్తారు. సంక్షేమ పథకాల అర్హులను రేషన్ కార్డుదారుల ఆధారంగా గుర్తిస్తారు. సంక్షేమ పథకాలతో పాటు విద్యా, వైద్య సేవలకు రేషన్ కార్డు చాలా ముఖ్యం. దీంతో అర్హులు కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తుంటారు. తెలంగాణ గత కొన్నేళ్లుగా కొత్త రేషన్ కార్డులు జారీ అవ్వలేదు. దీంతో అర్హులై ఉండి కూడా చాలా మంది సంక్షేమ పథకాలు పొందలేకపోతున్నారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ప్రజాపాలన ద్వారా అర్హుల నుంచి సమాచారం సేకరించిన విషయం తెలిసింది. ఇదిలా ఉంటే ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డులకు ఈ-కైవీసీ తప్పనిసరి చేసింది కేంద్రం. జూన్ 30తో ఈ కేవైసీ గడువు ముగుస్తుంది. ఇప్పటికే ఈ-కేవైసీకి గడువును చాలా సార్లు పొడగిస్తూ వచ్చింది కేంద్రం. ఈ కేవైసీ పూర్తిచేయకపోతే రేషన్ సరుకులు నిలిపివేస్తారు. సాంకేతిక కారణాల వల్ల రేషన్ కేంద్రాల్లో చాలా మంది ఈకేవైసీలో సమస్యలు వస్తున్నాయి. ఆధార్ కార్డ్ అప్డేట్ చేసుకోకపోవడమే ఈ సమస్యలు వస్తున్నాయని డీలర్లు చెబుతున్నారు. ఏడు నెలలుగా రాష్ట్రంలో ఈ కేవైసీ ప్రక్రియ చేపట్టినా ఇంకా 100 శాతం పూర్తి కాలేదని అధికారులు తెలిపారు. ఆధార్ సమస్యల వల్ల కేవైసీ అప్ డేట్ ఆలస్యం ఉందని, జనాలు ఆధార్ కేంద్రాలకు క్యూ కడుతున్నారు.

# మల్లారెడ్డికి టీటీడీపీ బాధ్యతలు



**హైదరాబాద్, జూన్ :** తెలంగాణలో రాజకీయాల్లో ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. లోక్‌సభ ఫలితాలు తర్వాత ఊహించని మార్పులు వస్తాయని నేతలు బహిరంగంగా చెప్పారు. ప్రస్తుతం బీఆర్ఎస్‌లో ఉన్న చాలా మంది నాయకులు తెలుగుదేశం పార్టీ వైపు చూస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. దాదాపు ఆరుగురు నేతలు ఇప్పటికే అధినేత చంద్రబాబుతో మంతనాలు జరిపినట్టు అందులోని సారాంశం. అదే జరిగితే కారు పార్టీ ఖాళీ కావడం ఖాయమని చర్చించుకుంటున్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత పదేళ్లపాటు పాలించింది టీఆర్ఎస్ అలియాస్ బీఆర్ఎస్ పార్టీ. అందులోని నేతలంతా దాదాపు టీడీపీ నుంచి వెళ్లినవారే. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఫలితాలు తారుమారయ్యాయి. బీఆర్ఎస్ బదులు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈసారి బీఆర్ఎస్ నుంచి గెలిచినవాళ్లలో తెలుగుదేశం పార్టీ నుంచి వెళ్లినవారు ఉన్నారు. ప్రస్తుతం అధికార కాంగ్రెస్ ప్రభుత్వం దూకుడును బీఆర్ఎస్‌లోని చాలామంది నేతలు తట్టుకోలేకపోతున్నారు. ఈ క్రమంలో సొంతగూటికి చేరుకోవాలనే ఆలోచనలో నేతలు ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ముఖ్యంగా మాజీ మంత్రి మల్లారెడ్డి కూడా అందులో వున్నట్లు సమాచారం. తెలంగాణ కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మల్లారెడ్డి ఆగడాలు బయటకు వచ్చాయి. ల్యాండ్ కబ్జాలు, కాలేజీలో విద్యార్థుల ధర్నాలు వంటి ఘటనలతో ఆయన కొంత బేజారు అయినట్టు తెలుస్తోంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో కాంగ్రెస్ వైపు వెళ్లకుండా టీడీపీ వైపు వెళ్తేనే బెటరని ఓ వ్యక్తి సలహా ఇచ్చారట. ఈ క్రమంలో చంద్రబాబుతో ఆయన మంతనాలు చేసినట్టు తెలుస్తోంది. అదే జరిగితే తెలంగాణలో టీడీపీకి పూర్వ వైభవం రావడం ఖాయమన్నమాట. గతంలో చాలాసార్లు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పిలుపు నిచ్చారు. తమ పార్టీ నుంచి వెళ్లిన నేతలు తిరిగి రావాలని విజ్ఞప్తి చేశారు. చివరకు పలువురు నేతలకు టీడీపీ వైపు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే బీఆర్ఎస్ పాత్రను తెలుగుదేశం పోషించడం ఖాయమని అంటున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో బీజేపీ వైపు వెళ్లడం కరెక్ట్ కాదని, మరింత ఒత్తిళ్లు పెరుగుతాయని అంటున్నారు. ఈ ప్రచారం గురించి మాజీ మంత్రి మల్లారెడ్డి ఏమంటారో చూడాలి.

Edited, Printed, Published and Owned by B. Narsingh, Printed at Vijetha Graphics & Offset Printers, H.No. 19-6-109, Godavarkhani,Karimnagar, Telangana State.
Published at H.No. 15-4-76/4, Jawaharnagar, Godavarikhani, Karimnagar, Telangana State,. Editor B. Narsingh, Email : kranthi995@gmail.com, tnfocus5@gmail.com
Website : telangananundifocus.com Cell : 7995282199, 9959954795.